నమస్తే తెలంగాణ
వరంగల్ హనుమకొండ
3 | గురువారం 29 ఫిబ్రవరి 2024 | WARANGAL HANUMAKONDA

# ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా షురూ



హనుమకొండలో పరీక్ష కేంద్రానికి వస్తున్న విద్యార్థులు

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్, ఫిబ్రవరి 28 : ఇంటర్మీడియట్ పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు ఇంటర్ ప్రథమ సంవత్సరం సంస్కృతం, తెలుగు పరీక్షలు జరిగాయి. హనుమకొండ జిల్లాలో ఏర్పాటు చేసిన 53 సెంటర్లలో 20,712 మంది విద్యార్థులకు గాను 19,986 మంది పరీక్షలు రాశారు. జనగామ జిల్లాలోని 18 కేంద్రాల్లో 4,610 మందికి గాను 4,400 మంది, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని 8 సెంటర్లలో 1,848 మందికి గాను 1,751 మంది, ములుగులోని 10 కేంద్రాల్లో 2004 మందికి గాను 1,871 మంది, మహబూబాబాద్‌లోని 19 సెంటర్లలో 4,935 మందికి గాను 4573 మంది, వరంగల్ జిల్లాలో 5363 మందికి గాను, 5094 మంది విద్యార్థులు పరీక్షలు రాసినట్లు అధికారులు తెలిపారు.



తల్లులను దర్శనం చేసుకుంటున్న భక్తులు



సమ్మక్క గుడిలో ముగ్గులు వేసిన మహిళలు

# మేడారంలో తిరుగువారం పండుగ

- తల్లుల దేవాలయాల్లో ప్రత్యేక పూజలు
- మొక్కులు సమర్పించిన పూజారులు

తాడ్వాయి, ఫిబ్రవరి 28 : మేడారం సమ్మక్క-సారలమ్మ పూజారులు బుధవారం తిరుగువారం పండుగను ఘనంగా నిర్వహించారు. జాతర అనంతరం వచ్చే బుధవారం తిరుగువారం పండుగగా నిర్వహించడం పూర్వకాలం నుంచి వస్తున్న ఆచారం. ఈ నెల 5న గుడిమెలిగే పండుగ సందర్భంగా అమ్మవార్ల పూజా సామగ్రిని బయటకు తీసి పూజా కార్యక్రమాలు ప్రారంభించారు. అనంతరం వచ్చే బుధవారం మండెమెలిగే పండుగ, తర్వాత వచ్చే బుధవారం జాతర ప్రారంభ పూజలు చేశారు. తిరుగు వారం వరకు మేడారంలోని సమ్మక్క పూజా మందిరం, కన్నెపల్లిలోని సారలమ్మ ఆలయంలో ప్రతిరోజూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. జాతర ముగియగానే పూజా కార్యక్రమాలు నిర్వహించిన వస్త్రాలు, పూజా సామగ్రిని పూజారులు శుద్ధి చేశారు. అనంతరం పూజారులు కుటుంబాలకు చెందిన ముత్త యిదువలు డోలు వాయిద్యాల నడుమ పూజా మందిరాలకు చేరుకొని గద్దెలను అలంకరించారు. పూజారుల కుటుంబాలు తలనీలాలను సమర్పించారు. తల్లులకు పసుపు, కుంకుమ, ధూపదీప నైవేద్యాలతో ప్రత్యేక పూజలు చేశారు. అక్కడినుంచి పూజామందిరాల వద్దకు చేరుకుని రాత్రి అమ్మవార్ల పూజా మందిరాల వద్ద జాగారం చేస్తారు. అమ్మవార్లకు చివరిగా పూజలు చేసి పూజా మందిరాలకు తాళాలు వేస్తారు.

**వనదేవతలకు మొక్కులు**

మేడారం సమ్మక్క-సారలమ్మకు బుధవారం తిరుగువారం మొక్కులు సమర్పించేందుకు భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. జాతర అనంతరం వచ్చే బుధవారం అమ్మవార్ల పూజారులు తిరుగువారం పండుగను నిర్వహించడం ఆనవాయితీ. తెలుగు రాష్ట్రాల్లోని పలు జిల్లాల నుంచే కాకుండా వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు పలు వాహనాల్లో తరలివచ్చారు. జంపన్నవాగులో పుణ్యస్నానాలు ఆచరించి అక్కడి నుంచి తల్లుల గద్దెల వద్దకు చేరుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవార్ల దర్శనానికి అధికసంఖ్యలో భక్తులు తరలిరావడంతో తల్లుల గద్దెల ప్రాంగణంతోపాటు జాతర పరిసరాలు రద్దీగా మారాయి. భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో ట్రాఫిక్ సమస్యలు రాకుండా పోలీసులు వాహనాలను గద్దెల సమీపానికి వచ్చేందుకు అనుమతించలేదు. హరిత హోటల్ వద్ద ఏర్పాటు చేసిన పార్కింగ్ ప్రదేశానికి తరలించారు. కాగా, మంత్రి సీతక్క బుధవారం రాత్రి తిరుగువారం మొక్కులు చెల్లించారు. అనంతరం మృతిచెందిన సమ్మక్క పూజారి సిద్దబోయిన దశరథం కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం కమాండ్ కంట్రోల్ రూమ్‌లో డీపీవో వెంకయ్యతో జాతర పరిసరాల్లో జరుగుతున్న పారిశుధ్య పనుల వివరాలను తెలుసుకున్నారు.

- మగతనానికి రాజకీయానికి ఏం సంబంధం?
- సీఎం కుర్చీ నీకు ఇనాంగా ఇచ్చిందే
- కాంగ్రెస్‌దే కుటుంబ పాలన
- ప్రశ్నించే వారిపై విరుచుకుపడుతున్న కాంగ్రెస్ పార్టీ
- మేడిగడ్డ బరాజ్ కొట్టుకుపోవాలని ప్రభుత్వం కుట్ర
- వెంటనే మరమ్మతులు చేపట్టి రైతాంగాన్ని ఆదుకోవాలి
- కాళేశ్వరంపై కాంగ్రెస్ విష ప్రచారాన్ని తిప్పికొట్టేందుకు మేడిగడ్డ సందర్శన
- విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే శ్రీహరి




హనుమకొండలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, చిత్రంలో వరంగల్ ఎంపీ పసునూరి దయాకర్, మాజీ ఎమ్మెల్యేలు చల్లా ధర్మారెడ్డి, అరూరి రమేశ్

# గ్యారెంటీలు అమలు చేయలేక సీఎం అసహనం

## 17 ఎంపీ సీట్లు గెలిచి నీ మగతనం రుజువు చేసుకో
## సీఎం రేవంత్‌రెడ్డికి ఎమ్మెల్యే కడియం సవాల్

హనుమకొండ, ఫిబ్రవరి 28 : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఫైర్ అయ్యారు. ప్రతి సందర్భంలో ప్రతిపక్షాలను మగతనం అంటూ దుర్భాషలాడుతున్న రేవంత్‌రెడ్డి.. దమ్ముంటే వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణలోని 17 ఎంపీ స్థానాలను గెలిపించుకొని తన మగతనం ఏమిటో నిరూపించుకోవాలని సవాల్ విసిరారు. బుధవారం హనుమకొండలోని ఆయన నివాసంలో ఎంపీ పసునూరి దయాకర్, వరంగల్ జిల్లా బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు అరూరి రమేశ్, మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డితో కలిసి విలేకరులతో మాట్లాడారు. రేవంత్‌రెడ్డి సీఎం అయ్యాక భాష మార్చుకొని హుందాగా వ్యవహరిస్తాడని అనుకున్నానని కానీ రోజు రోజుకూ సహనం కోల్పోయి ప్రతిపక్షాలపై దాడి చేస్తున్నాడని కడియం ఆగ్రహం వ్యక్తం చేశారు.

రాజకీయాలకు మగతనానికి సంబంధం ఏమిటని కడియం ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ అధినేత సోనియాగాంధీ, ప్రియాంకాగాంధీ ఇద్దరు మహిళల నాయకత్వంలో పని చేస్తూ మగతనం గురించి మాట్లాడడం వారిని కించపరిచినట్లేనని పేర్కొన్నారు. గతంలో పనిచేసిన సీఎంపై పరుష పద జాలం ఉపయోగించడం బాధాకరం అన్నారు. ఆరు గ్యారెంటీల అమలుపై ప్రశ్నించే వారిపై దాడులు చేయడాన్ని ఖండిస్తున్నామని అన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పని చేయాల్సిన సీఎం రేవంత్‌రెడ్డి తీరు జుగుప్సాకరంగా ఉందని కడియం ఆరోపించారు. కొత్త రాష్ట్రం అయినప్పటికీ కేసీఆర్ తెలంగాణను అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు నడిపి దేశానికి రోల్‌మాడల్‌గా నిలుపడమే కాకుండా కేంద్రం, అంతర్జాతీయ సంస్థల మెప్పు పొందారని ఈ సందర్భంగా గుర్తుచేశారు. రాష్ట్ర తలసరి ఆదాయం గణనీయంగా పెంచి దేశంలోనే 2వ స్థానం, పంటల దిగుబడిని నంబర్‌వన్ స్థానంలో నిలిపారన్నారు. ప్రతి పల్లె, గూడానికీ రక్షిత మంచి నీరు అందించిన కేసీఆర్ పరిపాలనా దక్షతను మెచ్చుకోకున్నా గత ప్రభుత్వం అమలు చేసిన పథకాలను, విజయాలను వైఫల్యాలుగా చిత్రీకరించే ప్రయత్నం చేయడంపై కడియం మండిపడ్డారు. సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణ ప్రతిష్టను జాతీయ స్థాయిలో దిగజార్చుతున్నారనే విషయాన్ని గమనించాలని లేకపోతే తీవ్రంగా నష్టపోతామని ఇప్పటికైనా కాంగ్రెస్ పెద్దలు గమనించాలని హితవు పలికారు. కాంగ్రెస్ ప్రభుత్వం నీటి పారుదల రంగంపై శ్వేతపత్రం విడుదల చేసిందని అందులో కాళేశ్వరం ప్రాజెక్టుకు రూ.93వేల కోట్లు ఖర్చుపెట్టి 98 వేల ఎకరాలకు మాత్రమే అదనంగా ఆయకట్టు వచ్చిందని అంటున్నారు కానీ 30లక్షల ఎకరాలకు సాగు నీటిని స్థిరీకరించిన విషయాన్ని మరచిపోతున్నారని కడియం ఆగ్రహం వ్యక్తం చేశారు.

**అరచేతిలో వైకుంఠం చూపించారు..**

ఎన్నికలకు ముందు అరచేతిలో వైకుంఠం చూపించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు పిచ్చి పిచ్చి హామీలు ఇచ్చి ఇప్పుడు తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారని కడియం ధ్వజమెత్తారు. ఆరు గ్యారెంటీల పేరుతో ఇచ్చిన 13 హామీల అమలుపై ప్రశ్నించిన వారిపై దాడి చేసే ప్రయత్నం చేస్తున్నారని ఇది సిగ్గు చేటన్నారు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలు, బీఆర్‌ఎస్ మేనిఫెస్టో అమలుపై చర్చకు తాము సిద్ధం.. మీరు సిద్ధమా అని కడియం సవాల్ విసిరారు. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు నెలనెలా ఆర్థిక సహాయం అందించడం లేదు, పింఛన్‌ను రూ.2వేల నుంచి 4వేలకు పెంచుతాన న్నారు ఆ ఊసే లేదన్నారు. అలాగే రైతుబంధు, రుణమాఫీ విషయంలో స్పష్టత లేదని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి చెప్పినట్టుగా 100 రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వాన్ని కూల్చుతారనే భయం సీఎం రేవంత్‌రెడ్డికి పట్టుకుందని, మీ అంతట మీరు కూలిపోతే మాకు సంబంధం లేదని మీ వాళ్లతో కొంత జాగ్రత్తతో ఉండండి అంటూ హితవు పలికారు. చేవెళ్ల సభలో కూడా రేవంత్ మాటలు విడ్డూరంగా ఉన్నాయని, నా కుర్చీని తాకొద్దని పక్కనున్న మంత్రులకు చెప్పినట్లు అనిపించిందని కడియం పేర్కొన్నారు. విపక్షాన్ని చూపించి స్వపక్ష నేతలను హెచ్చరించినట్లు ఉందని అన్నారు.

**సీఎం కుర్చీ ఇనాం కింద వచ్చిందే**

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఆ కుర్చీ ఇనాం కిందనే వచ్చినట్లు మేం భావిస్తున్నామని ఎమ్మెల్యే కడియం అన్నారు. వారసత్వ రాజకీయాలను దేశంలో ప్రవేశపెట్టి కుటుంబ రాజకీయాలను ప్రోత్సహించింది కాంగ్రెస్ కాదా అని ప్రశ్నించారు. ఆ కుటుంబం ఇనాం కింద ఇస్తేనే కదా నీకు కుర్చీ వచ్చింది కదా అని అన్నారు. ఇందిరాగాంధీ పేరు లేకుండా బతుకలేని మీకు కుటుంబ పాలన గురించి మాట్లాడే హక్కు లేదన్నారు. కాళేశ్వరంపై కాంగ్రెస్ విష ప్రచారం తిప్పికొట్టేందుకే మార్చి 1న మేడిగడ్డకు బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో వెళ్తున్నామని తెలిపారు. ప్రాజెక్టు వివరాలు ప్రజలు తెలియజేస్తామన్నారు. ఇప్పటికైనా సీఎం తన భాష మార్చుకొని, హుందాతనంతో వ్యవహరించాలని కడియం శ్రీహరి హితవు పలికారు. సమావేశంలో వెంకటేశ్వర్‌రావు, జఫర్‌గఢ్ పీఏసీఎస్ సభ్యుడు కరుణాకర్‌రావు, లింగారెడ్డి, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

**కాళేశ్వరం అంటే మేడిగడ్డే కాదు**

కాళేశ్వరం అంటే ఒక మేడిగడ్డే కాదు సుందిళ్ల, అన్నారం, మేడిగడ్డ అని తెలిపారు. 3 బ్యారేజ్‌లు, 15 రిజర్వాయర్లు, 21 పంప్ హౌస్‌లు 203 సొరంగ మార్గాలున్నాయని అన్నారు. ఇందులో సాంకేతిక కారణాలు, అధిక నీటి నిల్వ వంటి సమస్యలతో మూడు పిల్లర్లు కుంగిపోయాయని నిపుణులు, నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీతో విచారణ జరిపి బాధ్యులు ఎంతటివారైనా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టును కాంగ్రెస్ పార్టీ రాజకీయం, దుష్ప్రచారం చేస్తూ ప్రజలను తప్పుతోవ పట్టిస్తూ లబ్ధిపొందే ప్రయత్నం చేస్తున్నదని మండిపడ్డారు. రానున్న వర్షాకాలంలో వరదలు వచ్చి మేడిగడ్డ పూర్తిగా కొట్టుకపోతే దీన్ని అంతా గత ప్రభుత్వంపై ఆపాదించేందుకు కుట్ర చేస్తున్నట్లు అనిపిస్తున్నదని అన్నారు. మీ దుర్మార్గపు ఆలోచనలు, రాజకీయాలతో రైతులను ఆగం చేయకుండా వెంటనే కాఫర్ డ్యాం నిర్మించి రైతాంగాన్ని ఆదుకోవాలన్నారు.



కలెక్టర్‌కు తల్లుల గద్దెల చిత్రపటాన్ని అందిస్తున్న మంత్రి సీతక్క

# సమష్టి కృషితో జాతర పూర్తి

- మీడియా సేవలు భేష్
- వైటీసీలో యూనివర్సిటీ తరగతుల ప్రారంభానికి ఏర్పాట్లు
- లక్నవరం సరస్సులోకి గోదావరి జలాల మళ్లింపు
- రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క

ములుగు, ఫిబ్రవరి 28(నమస్తే తెలంగాణ) : మేడారం మహా జాతర సమష్టి కృషితో పూర్తయిందని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి సీతక్క అన్నారు. జాతర ముగిసిన సందర్భంగా బుధవారం గిరిజన భవన్‌లో కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శబరీష్‌తో కలిసి మంత్రి మీడియా ప్రతినిధులకు కృతజ్ఞత సమావేశాన్ని నిర్వహించారు. వనదేవతల కీర్తిని ప్రపంచానికి తెలియజేసిన మీడియాకు అభినందనలు తెలిపారు. మొదటిసారిగా జాతరలో మంత్రిగా అన్ని కార్యక్రమాలను నిర్వహించానని అన్నారు. జాతరపై తనకు ఎంతో అనుభవం వచ్చిందన్నారు. అన్ని శాఖల అధికారుల సమన్వయంతో జాతర పూర్తయిందన్నారు. ప్రతి ఒక్కరి అనుభవాలను పుస్తక రూపంలో పొందుపర్చి లోపాలు పునరావృతం కాకుండా చూస్తామన్నారు. వన ప్రవేశం చేసే సమయంలో చిరుజల్లులు కురిసి అమ్మవారి దీవెనలకు సంకేతంగా నిలిచాయన్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి గిరిజన యూనివర్సిటీ తరగతులను జాకారం వైటీసీలో ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. రామప్ప సరస్సులోకి వస్తున్న గోదావరి జలాలను లక్నవరం సరస్సులోకి మళ్లించే పనులను ప్రారంభించనున్నట్లు మంత్రి పేర్కొన్నారు. మీడియా ప్రచారం ద్వారానే అంచనాలకు మించి భక్తులు అధిక సంఖ్యలో జాతరకు వచ్చారని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. గత జాతరతో పోల్చితే ఈ జాతరలో ఎలాంటి రోడ్డు ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టామని ఎస్పీ శబరీష్ అన్నారు. మంత్రి పర్యవేక్షణలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయడంతోనే జాతర విజయవంతమైందన్నారు. అనంతరం ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులను మంత్రి, కలెక్టర్, ఎస్పీలు శాలువాలతో సన్మానించి ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు, బెల్లం(బంగారం) అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, డీఎస్పీ రవీందర్, మేడారం ఈఓ రాజేంద్రం, ఐపీఆర్ ఏడీ లక్ష్మణ్, డీపీఆర్వో రఫిక్, సీఐ మేకల రంజిత్ కుమార్, ఎస్సై వెంకటేశ్వర్, తహసీల్దార్ విజయ్‌భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# నదుల అనుసంధానానికి కేంద్రం శ్రీకారం

- నిట్‌కు కృష్ణా బేసిన్ అధ్యయన బాధ్యతలు
- కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ ఉత్తర్వులు

వరంగల్, ఫిబ్రవరి 28 : దేశంలోని ప్రధానమైన ఆరు నదుల అనుసంధానానికి కేంద్ర జలశక్తి శాఖ శ్రీకారం చుట్టింది. నీటి వనరులను దేశంలోని అన్ని ప్రాంతాలు వినియోగించుకునేలా ప్లాన్ చేస్తున్నది. ఇప్పటికే గంగా రివర్ బేసిన్‌పై ప్రతిష్టాత్మక కాన్పూర్ ఐఐటీ అధ్యయనం చేసింది. అదే తరహాలో నర్మద, గోదావరి, కృష్ణా, కావేరి, పెరియార్, మహానదిపై అధ్యయనం చేసే బాధ్యతలను ఐఐటీ, ఎన్ఐటీలకు జలశక్తి శాఖ అప్పగించింది. బుధవారం ఢిల్లీలోని అంబేద్కర్ ఇంటర్నేషనల్ సెంటర్‌లో జరిగిన సదస్సులో కేంద్ర జలశక్తి మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ నదుల అనుసంధాన అధ్యయనం చేసే బాధ్యతలను ఐఐటీలకు అప్పగిస్తున్నట్లు ప్రకటించారు. నేషనల్ రివర్ కన్సర్వేషన్ డైరెక్టరేట్ (ఎన్ఆర్‌సీడీ), కేంద్ర జలశక్తి శాఖ ఆధ్వర్యంలో నదుల అధ్యయనం జరుగనుంది. 2019 పార్లమెంట్ సమావేశంలో అప్పటి రాష్ట్రపతి రాంనాథ్ కోవింద్ దేశంలోని ప్రధాన నదుల అనుసంధానం ప్రాజెక్టును ప్రకటించిన విషయాన్ని ఆ మంత్రిత్వ శాఖ పేర్కొంది.


**కృష్ణా బేసిన్ బాధ్యతలు నిట్‌కు అప్పగింత..**

దేశంలోని ప్రధాన నదుల అనుసంధానంలో భాగంగా కృష్ణా బేసిన్ అధ్యయన బాధ్యతలను వరంగల్ నిట్‌కు అప్పగించారు. ఈ మేరకు కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. త్వరలోనే వరంగల్ నిట్ ప్రొఫెసర్లు, విద్యార్థుల సహకారంతో కృష్ణా బేసిన్‌పై అధ్యయనం చేపట్టనున్నారు. కృష్ణా బేసిన్‌లో నీరు, వినియోగం, వృథా తదితర అంశాలపై నిట్ బృందం అధ్యయనం చేసి కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖకు నివేదిక అందించనున్నది.

# స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ల బదిలీ

హనుమకొండ, ఫిబ్రవరి 28 : రాష్ట్ర వ్యాప్తంగా రెవెన్యూ శాఖలో పని చేస్తున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, డిప్యూటీ కలెక్టర్లను బదిలీ చేస్తూ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిట్టల్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. వరంగల్ ఉమ్మడి జిల్లా పరిధిలో పలువురు బదిలీ అయ్యారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ల విభాగంలో హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ మహేందర్ జీ ములుగు జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గా, ములుగు అదనపు కలెక్టర్ వేణుగోపాల్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గా బదిలీ చేశారు. సూర్యాపేట జిల్లా అదనపు కలెక్టర్ ఏ వెంకట్‌రెడ్డికి హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గా పోస్టింగ్ ఇచ్చారు. అలాగే డిప్యూటీ కలెక్టర్ల విభాగంలో పరకాల ఆర్‌డీగా విధులు నిర్వర్తిస్తున్న కే శ్రీనివాస్‌ను కల్లూరుకు, భూపాలపల్లి ఆర్డీవో కే రమాదేవిని మెదక్ ఆర్డీవోగా, వరంగల్ ఆర్డీవో ఎం వాసుచంద్రను నారాయణపేట ఆర్డీవోగా, స్టేషన్ ఘన్‌పూర్ ఆర్డీవో కే రామ్మూర్తిని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ట్రైబల్ వెల్ఫేర్ ఏటూరునాగారం, హనుమకొండ ఆర్డీవో ఎల్ రమేష్‌ను సిరిసిల్ల ఆర్డీవోగా, జనగామ ఆర్డీవో మురళీకృష్ణను హైదరాబాద్‌లోని జనరల్ అడ్మినిస్ట్రేషన్‌కు, ట్రైబల్ వెల్ఫేర్ ఏటూరునాగారం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ డీఎస్ వెంకన్నను స్టేషన్ ఘన్‌పూర్ ఆర్డీవోగా, నారాయణఖేడ్ ఆర్డీవో ఎన్ వెంకటేశ్‌ను హనుమకొండ ఆర్డీవోగా, భూపాలపల్లి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (భూసేకరణ) కే నారాయణను పరకాల ఆర్డీవోగా బదిలీ చేశారు. అదే విధంగా ఆదిలాబాద్ ఆర్డీవో స్రవంతి బ్రహ్మరాతును వరంగల్ ఆర్డీవోగా, ఆర్మూర్ ఆర్డీవో టీ వినోద్‌కుమార్‌ను భూపాలపల్లి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (ఎల్ఏ)గా, భద్రాచలం ఆర్డీవో ఎం మంగీలాల్‌ను భూపాలపల్లి ఆర్డీవోగా, హైదరాబాద్‌లో స్పెషల్ ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్‌గా విధులు నిర్వర్తిస్తున్న డీ కొమురయ్యకు జనగామ ఆర్డీవోగా పోస్టింగ్ ఇస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

# వైద్యం అందక నవజాత శిశువు మృతి



బుద్ది ఆరోగ్యంపై ఆరా తీసున్న డీఎంహెచ్‌వో అల్లం అప్పయ్య


వెంకటాపూర్, ఫిబ్రవరి 28 : సమయానికి చికిత్స అందక నవజాత శిశువు మృతి చెందిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వెంకటాపూర్ మండలంలోని రోలుబండ గొత్తికోయగూడేనికి చెందిన మడకం భీమా-బుద్ది దంపతులకు ఈ నెల 25న ఇంటి వద్ద ఆడ శిశువు జన్మించింది. నెలలు నిండక ముందే పుట్టడంతో శిశువు అనారోగ్యానికి గురై చికిత్స అందక మరుసటి రోజు మృతిచెందింది. ఈ క్రమంలో 27న ఆమె ఆరోగ్యం కూడా క్షీణించడంతో చికిత్స కోసం భర్త భీమా సైకిల్‌పై ఆరు కిలోమీటర్లు ప్రయాణించి మండలకేంద్రానికి తీసుకొచ్చాడు. తెలిసిన వారికి విషయం తెలుపగా వారు 108కు ఫోన్ చేసి ములుగు ఏరియా హాస్పిటల్‌కు తరలించారు. తాము ఉండే గ్రామంలో వైద్య సదుపాయం, రవాణా సౌకర్యం కల్పించాలని, నిత్యం అందుబాటులో డాక్టర్లు ఉండేలా చూడాలని, వైద్యం అందక చాలామంది చనిపోతున్నారని ఈ సందర్భంగా భీమా ఆవేదన వ్యక్తం చేశాడు. తమ సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్, అధికారులు, ప్రభుత్వాన్ని కోరాడు.

**మెరుగైన వైద్యం అందించండి**

ఏరియా ఆసుపత్రిలో బుద్ధి చేరినట్లు తెలుసుకున్న డీఎంహెచ్‌వో అప్పయ్య ఆమెకు అందిస్తున్న చికిత్సపై ఆరా తీశారు. మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీకాంత్ ఉన్నారు.

# బండి కాన్వాయ్‌పై కోడిగుడ్ల దాడి

- భీమదేవరపల్లి వంగరలో ఘటన
- బందోబస్తు వద్దని పోలీసులకు ఎంపీ ఆదేశాలు
- పీవీకి భారతరత్న ఇవ్వడం 'కాంగ్రెస్' నచ్చడం లేదు
- ప్రజాహిత యాత్రలో కరీంనగర్ ఎంపీ బండి సంజయ్



బండి కాన్వాయ్‌పై విసిరిన కోడిగుడ్డు



భీమదేవరపల్లి: విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బండి సంజయ్

భీమదేవరపల్లి, ఫిబ్రవరి 28 : భీమదేవరపల్లి మండలం వంగరలో కరీంనగర్ ఎంపీ, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ కాన్వాయ్‌పైకి గుర్తు తెలియని వ్యక్తులు బుధవారం కోడిగుడ్లు రువ్వారు. దీంతో తీవ్ర అసహనానికి గురైన బండి సంజయ్ తనకు బందోబస్తు అక్కర్లేదని పోలీసులకు చెప్పారు. దీంతో పోలీసులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. అనంతరం కొత్తకొండ వీరభద్ర స్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు చేసిన బండి, గట్లనర్సింగాపూర్, వంగర, ముల్కనూరులో ప్రజాహిత యాత్ర చేపట్టారు. వంగరలో మ్యూజియంగా మార్చిన పీవీ ఇంటిని సందర్శించారు. పీవీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అనంతరం మాట్లాడుతూ ఉమ్మడి ఏపీ నుంచి ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన పీవీ మహనీయుడన్నారు. ఆర్థిక సంస్కరణలు ప్రవేశపెట్టి దేశాన్ని ముందుకు నడిపించారని కొనియాడారు. విశ్వనాథ సత్యనారాయణ రాసిన 'వేయి పడగలు' పుస్తకాన్ని పీవీ హిందీలో అనువదించారని గుర్తు చేశారు. ఆయనను రాబోయే తరాలు స్మరించుకోవాలనే ప్రధాని మోదీ పీవీకి భారతరత్న అందించారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఇంకా దేశంలో మిగిలి ఉందంటే అదీ పీవీ చొరవ వల్లేనన్నారు. పీవీ ఆలోచనతోనే ఆపార్టీ శక్తివంతంగా తయారైందని చెప్పారు. అంతటి గొప్ప వ్యక్తి చనిపోతే అంత్యక్రియలు చేయకుండా అడుగడుగునా కాంగ్రెస్ పార్టీ ఎలా అవమానించిందో తెలుగు ప్రజలు చూశారని గుర్తుచేశారు. కేంద్రం పీవీకి భారత్నరత్న ఇచ్చి గౌరవిస్తే కాంగ్రెస్ పార్టీ కనీసం హర్షం కూడా వ్యక్తం చేయలేదన్నారు. బాబాసాహెబ్ అంబేద్కర్‌ను కూడా కాంగ్రెస్ పార్టీ అవమానించిందన్నారు. అంబేద్కర్‌ను ఎన్నికల్లో ఆ పార్టీ ఓడగొట్టిందని చెప్పారు. బీఆర్ అంబేద్కర్ పుట్టిన, చదివిన, చనిపోయిన స్థలాలను స్ఫూర్తిదాయక కేంద్రాలుగా మోదీ అభివృద్ధి చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ, నాయకులు జన్నపురెడ్డి సురేందర్‌రెడ్డి, బొమ్మ శ్రీరాంచక్రవర్తి, పృథ్వీరాజ్, నోముల భిక్షపతి పాల్గొన్నారు.

**'బండి'కి మతి భ్రమించింది..**

హుస్నాబాద్ నియోజకవర్గంలో పర్యటిస్తున్న ఎంపీ బండి సంజయ్‌కి ఓటమి భయం పట్టుకుందని, అందుకే ఆయన మతిభ్రమించి మాట్లాడుతున్నారని మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి ఒక ప్రకటనలో విమర్శించారు. రాజకీయాల్లో కుటుంబపరమైన విమర్శలు చేయడం బాధాకరమన్నారు. బండి సంజయ్ ఎక్కడ అభివృద్ధి చేశారో చూపించాలని ప్రశ్నిస్తే పొంతనలేని విమర్శలు చేస్తున్నారని దుయ్యబట్టారు.

## 100 రోజుల్లో అమలు చేయకపోతే ప్రజలే తిరగబడుతరు

ఎల్కతుర్తి : కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పినట్లు వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలను అమలు చేయకపోతే ప్రజలే తిరగబడతారని ఎంపీ బండి సంజయ్ హెచ్చరించారు. ప్రజాహిత యాత్రలో భాగంగా బుధవారం ఎల్కతుర్తి మండలంలోని గోపాల్‌పూర్, చింతలపల్లి, దామెర, ఎల్కతుర్తి, సూరారం, దండేపల్లి గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేషన్ కార్డులున్న వారికే గ్యారెంటీలను అందిస్తామని చెప్పడం సరికాదని, రేషన్ కార్డులే ఇవ్వకపోతే ఎక్కడినుంచి వస్తాయని ప్రశ్నించారు. ఓ కాంగ్రెస్ పెద్ద మనిషి అమ్మను అడ్డం పెట్టుకొని రాజకీయం చేస్తున్నాడని, అది ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నానని చెప్పారు. 100 రోజుల్లో హామీలు అమలు చేయకపోతే రాష్ట్రమంతా తిరిగి కాంగ్రెసోళ్లకు చుక్కలు చూపిస్తానని హెచ్చరించారు.